# అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో..

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ



కిష్టంపేటలో బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, డిసెంబర్ 1 : సాధారణ ఎన్నికల సందర్భంగా గురువారం జరిగిన ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో పోటీ చేసిన వివిధ పార్టీల, స్వతంత్ర అభ్యర్థుల రాజకీయ భవిష్యత్ ఈవీఎం పెట్టెల్లో భద్రంగా ఉంది. బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య విజయం కోసం ముఖ్యంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు దుర్గం వెంకటేశ్ నేతకాని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ప్రముఖ నాయకులు అహర్నిషల కృషి చేశారు. బెల్లంపల్లి, కాసిపేట, వేమనపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, తాండూర్ మండలాలతో ఉండి ఎస్సీలకు రిజర్వ్ చేయబడి బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల ఫలితం ఎలా ఉండగలదోనని జిల్లా వ్యాప్తంగా చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ప్రధాన పార్టీలకు దుర్గం చిన్నయ్య (బీఆర్ఎస్), మాజీ మంత్రి గడ్డం వినోద్ (కాంగ్రెస్), అమరాజుల శ్రీదేవి (బీజేపీ)తో పాటు మరి కొంత మంది పలు పార్టీలు, స్వతంత్రులు ప్రస్తుతం బెల్లంపల్లి శాసనసభా స్థానానికి అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఏడు మండలాల్లో ఓటర్ల నాడి ఏ విధంగా ఉంటుందో ఏమాత్రం అంతు చిక్కని స్థితిలో ఉంది. తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరణ చూపుతున్నారని భావిస్తున్న అభ్యర్థులంతా విజయంపై విశ్వాసంతో ఉన్నారు. సిట్టింగ్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే కచ్చితంగా విజయలక్ష్మి వరించగలదనే విశ్వాసంతో ఉన్నారు. తమ రాజకీయ భవితవ్యాన్ని నిర్ధేశించగల ఎన్నికలలో తలపడి, గెలుపు విషయంలో ఎవరిధీమాలో వారు ఉంటూ, ఓటింగ్ సరళిపై ఆరాతీస్తూ ఫలితాలపై విశ్లేషించుకుంటున్నారు.

**తాండూర్ మండలంలో తగ్గిన ఓటింగ్ శాతం**

బెల్లంపల్లి శాసనసభ నియోజకవర్గంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తాండూర్ మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాల్లో 78.18 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో 26,739మంది ఓటర్లుకు గాను 20994 మంది ఓట్లు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ముగించే సరికి రికార్డు స్థాయిలో 78.18శాతం పోలింగ్ నమోదైంది. గతంలో 2018లో డిసెంబర్ 7న జరిగిన ఎన్నికల్లో 79.60 శాతం పోలింగ్ జరుగగా ఈ సారి 78.18 ఓటింగ్ జరిగి మొత్తానికి 1.42 శాతం ఓటింగ్ తగ్గింది. మండలంలో మొత్తం 4 రూట్లుగా విభజించి నలుగురు సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, ఏపీఎంలు దాదాపు 296 మంది విధులు నిర్వర్తించారు.

**సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్..**

తాండూర్ మండలం సమస్యాత్మక గ్రామాల్లో గురువారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంలో సమస్యాత్మక, సాదారణ పోలింగ్ స్టేషన్లను గుర్తించి వాటి కోసం ప్రత్యేకంగా ఉద్యోగులను, మైక్రో అబ్జర్వర్లుగా నియమించారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, తాండూర్ సర్కిల్ పరిధిలో ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చిన వరంగల్ డీఎస్పీ పాండు, తాండూర్, మాదారం ఎస్ఐలు రాజశేఖర్, అశోక్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బస్సులను, ఇతర వాహనాల్లో పోలింగ్ పూర్తయిన ఈవీఎం పెట్టెలను పోలీసు సెక్యూరిటీతో తరలించారు.

**తాండూర్ మండలంలో 78.18 శాతం పోలింగ్..**

తాండూర్, డిసెంబర్ 1 : తాండూర్ మండలంలోని మొత్తం 37 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 78.18 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు 26,739 కాగా 20,994 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బోయపల్లిలో బూత్ నంబర్ 111లో 709 ఓట్లకు గాను 606 ఓట్లు పోలవగా 85.47శాతం, బూత్ నంబర్112లో 612 గాను 516–84.31 శాతం, చౌటపల్లిలో 113లో 678 గాను 564– 83.19 శాతం, ద్వారకాపూర్‌లో 114లో 432 గాను 395– 91.44 శాతం, చంద్రపల్లిలో 115లో 469 గాను 418–89.13 శాతం, కాసిపేట 116లో 757 గాను 632–83.49 శాతం, కాసిపేట 117లో 663 గాను 569– 85.82 శాతం, తంగళ్లపల్లి 118లో1,006 గాను 754–74.95 శాతం, తంగళ్లపలి 119లో 843 గాను 644–76.39 శాతం, తంగళ్లపల్లి 120లో 789 గాను 594–75.29 శాతం, తాండూర్ ఐబీ 121లో 702 గాను 555–79.06 శాతం, తాండూర్ ఐబీ 122లో 738 గాను 547–74.12 శాతం, తాండూర్ ఐబీ 123లో 920 గాను 689–74.12 శాతం, తాండూర్ ఐబీ 124లో 956 గాను 685–71.65 శాతం, తాండూర్ ఐబీ 125లో 901 గాను 632–70.14 శాతం, తాండూర్ 126లో 979 గాను 707–72.22, తాండూర్ 127లో 1,157లో 902–77.96 శాతం, తాండూర్ 128లో 697 గాను 503–72.17 శాతం, తాండూర్ 129లో 706 గాను 478–67.71 శాతం, గోపాల్ నగర్ 130లో 413 గాను 352–85.23 శాతం, మాదారం 131లో 989 గాను743–75.13 శాతం, మాదారం 132లో 997 గాను 559–56.07 శాతం, మాదారం 133లో 639 గాను 432–67.61 శాతం, బెజ్జాల 134లో 316 గాను 287–90.82 శాతం, నర్సాపూర్ 135లో 415 గాను 352–84.82 శాతం, కొత్తపల్లి 136లో 699 గాను 593–84.84 శాతం, కొత్తపల్లి 137లో 712 గాను 541–75.98 శాతం, రేపల్లెవాడ 138లో 871 గాను 612–70.26 శాతం, రేచిని, బారెపల్లి, గజ్జలపల్లి 139లో 695 గాను 588–84.60 శాతం, రేచిని 140లో 642 గాను 532–82.87 శాతం, రేచిని 141లో 931 గాను 735–78.95 శాతం, రేచిని 142లో 524 గాను 427–81.49 శాతం, అన్నారం 143లో 243 గాను 225–92.59 శాతం, గంపలపల్లి 144లో 340 గాను 306–90.00 శాతం, అచ్చలాపూర్ 145లో 939 గాను 801–85.30 శాతం, అచ్చలాపూర్ 146లో 981 గాను 862–87.87 శాతం, అచ్చలాపూర్ 147లో 679 గాను 570–83.95 శాతం ఓట్లు నమోదయ్యాయి.

# ఊపందుకున్న యాసంగి సాగు

- శనగ సాగుకు రైతు సిద్ధం
- ఆశాజనకంగా ఇతర పంటలు

తాంసి, డిసెంబర్ 1: ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో పుష్కలంగా నీరు ఉండడంతో యాసంగి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. అధిక శాతం మంది రైతులు శనగ పంట వేస్తున్నారు. ప్రధానంగా మండలాల్లో జొన్న, వేరుశనగ, శనగ, కంది, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సాగునీటి వసతి కల్పించడంతో పల్లెల్లో పచ్చని పొలాలు దర్శనమిస్తున్నాయి.

**పెరిగిన సాగు విస్తీర్ణం**

తాంసి మండలంలో సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో యాసంగి సాగు పనులు ఊపందుకున్నాయి. గతంలో పోలిస్తే తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లో పంట సాగు విస్తీర్ణం పెరిగింది. తాంసి మండలంలో మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వారబంది పద్ధతిలో కాకుండా నిరంతరం సాగునీరు అందించడంతో 8500 ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. అలాగే కుంటలను నింపడం ద్వారా భూగర్భజలాలు పెరగడంతో చెరువుల పరిధిలోని బావులు నిండుగా మారి రైతులకు నీటి ఎద్దడి లేకుండా పోయింది. బావులు, బోర్ల ద్వారా వందల ఎకరాలకు నీరందుతున్నది. తాంసి మండలంలో 10 కిలో మీటర్ల ఎడమ కాలువలు లింక్, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ఉండగా బండల్‌నాగపూర్ నుంచి వచ్చే కాలువ ద్వారా వడ్డాడి నుంచి ప్రారంభమై జామిడి, కప్పర్ల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర, జందాపూర్, దిమ్మ, గ్రామాల్లో సాగునీరు అందనుంది. భీంపూర్, తాంసి, తలమడుగు మండలంలో వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేస్తున్నారు.



తలమడుగులో సాగు చేస్తున్న శనగ పంట

**వేల ఎకరాల్లో పంటలు సాగు..**

మండలాల్లో ఈ సారి సాగవుతున్న యాసంగి పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 98,300 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేపట్టగా యాసంగికి మరో సుమారు వెయ్యి ఎకరాల వరకు ఉంటుందని అంచనా వేశారు. తాంసి మండలంలో శనగ పంట 100 ఎకరాలు, భీంపూర్ మండలంలో 300, తలమడుగు మండలంలో 600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

**శనగ పంట పండిస్తున్నా..**



గతంలో మాదిరిగా రైతులకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. ప్రస్తుతం యాసంగి రెండో పంటగా శనగ సాగు చేస్తున్నాను. మిషన్ కాకతీయతో చెరువులు నిండు కుండలా మారడంతో పంటలు పండిస్తున్నాం.

**- కుంటల వెంకట్ రెడ్డి, రైతు, బండల్‌నాగపూర్**

**ఆశాజనకంగా పంటల సాగు..**



తాంసి, భీంపూర్ మండలాల్లో సాగు చేస్తున్న యాసంగి పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. త్వరలోనే శనగ పంట పనులు ప్రారంభం కానున్నాయి. రైతులు శనగ విత్తుకొని నీరు అందిస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి సాగు విస్తీర్ణంలో మార్పులేదు. ఉమ్మడి మండలంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. **- రవీందర్, మండల వ్యవసాయాధికారి, తాంసి**

# వైభవోపేతం.. రథోత్సవం

జైనథ్, డిసెంబర్ 1 : శ్రీలక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కార్తీక బహుళ పంచమిని పురస్కరించుకొని జైనథ్‌లో శుక్రవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీమన్నారాయణ నామస్మరణతో జైనథ్ మార్మోగింది. మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ముందుగా రథం ముందుర భక్తులు పురాతన ఆలయంలో దాచిన బల్లెంలను రంగు రంగుల పూలతో అలంకరించి, ప్రత్యేక వస్త్ర ధారణతో రథం ఎదుట యుద్ధ సైనికుల్లా నిలబడ్డారు. రథోత్సవ శోభాయాత్రను తిలకించారు.

**భక్తజన వాహిని మధ్య రథయాత్ర..**

స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు హోమం, పూర్ణకుంభం పూజలు నిర్వహించారు. వేద పండితులు ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో జై శ్రీమన్నారాయణ అంటూ భక్తులు రథాన్ని ముందకు కదిపారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు భజన, సంకీర్తన కోలాటాలతో శోభాయాత్ర సాగింది. సమీప ఆంజనేయ స్వామి వద్ద నిర్మించిన ఓ మండపానికి థం తగలగానే యుద్ధం సమాప్తి అయినట్లుగా భావించి, శోభాయాత్రను తిరిగి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. రథానికి జాతర సందర్భంగా ఐదు రోజుల పాటు భక్తులు ప్యాలాలు, పుట్నాలు చల్లుతూ కొబ్బరికాయలు కొడుతూ పూజలు నిర్వహిస్తారు. సామాజిక కార్యకర్త బండారి దేవన్న, సర్పంచ్ దేవన్న, ఎంపీటీసీ సుదర్శన్, రైతుబంధు కన్వీనర్ ఎస్ లింగారెడ్డి, టెంపుల్ ఈవో వామన్‌రావ్, మాజీ ఎండోమెంట్ చైర్మన్ పీ వెంకట రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**స్వామిని దర్శించుకున్న డీఎస్పీ..**

ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు సీవకరించారు. ఆయన వెంట సీఐ కోల నరేశ్, ఎస్ఐ పురుషోత్తం, నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, గణేశ్ యాదవ్, లస్మన్న, సంజీవ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.